తిరుమల గాథలు

# దేవతాత్మ

చల్లా సీతారామాంజనేయులు

పిల్లగాలులు తుంగభద్రా నదీతరంగముల మీఁదుగ పాఱాడుచు, చల్లదనమును సంగ్రహించుకొని, రాజోద్యానము నందలి బహువిధ పుష్పలతా గుల్మముల గిలిగింతలు వెట్టి, సువాసనల సుంకువగొని, వెన్నెలలు వెన్నంటి రాయల మలయకూట ప్రాసాదమున, నేడు పరుపులు ఒకదానిపై నొకటిగా పేర్చి యమర్చిన చందనపు హంసాకృతిగల తల్పముపైఁ బరుండిన శ్రీకృష్ణదేవరాయల మేన, నలఁతిగ సోకుచు, నుత్తరీయ మొక్కఁటే ధరించిన ప్రభువునకు, స్పర్శసుఖమును కల్గింప యత్నించి



విఫలములగుచుండెను. వెన్నెల మెనవి మెన వరమతృప్తితో కన్నులరమోడ్పులుగ, గునగునలు పో చకోరముల జంటల యులివులు, పిండియార బోసినట్లున్న వెన్నెలలఁ జూచి, తెల్లవారినద భ్రమపడి, కలకల నినాదము లొనర్పు శకుంతము కలరుతులు, గాలి తాకిడిచే నొఱపిడియై, కద నినదించు హజారరామస్వామి, విరుపా దేవాయతనము లందలి, ధ్వజస్తంభ శిఖరాగ్రము నుండి బంగరు చిఱుగంటల మువ్వల రవళులు ప్రభువుల కర్ణపుటములఁ జొ సాహసించలేకపోవుచుండెను !

శరత్పూర్ణిమా మధురజ్యోత్స్న విలసనములు అరవిచ్చు పుష్పసంతతుల వివిధ విన్యాసములు మనోహరమైన యుద్యానవనముల మీఁదు తాఱాడుచు, సుళ్ళు తిరుగు మలయమారుతములు గవాక్షముల గుండ చొచ్చుకొని వచ్చి సైతమ ప్రభువులకు ఘ్రాణతర్పణము గావించలేకపోవుచుండెను. ప్రభువు నిద్రించుటలేదు ఆయన నేత్రము లరవిచ్చిన తామరసముల వలె నున్నవి. ఆయన ముకుపుటము లదరుచు, క్రొత్తగ గా మెసవుట నేర్చుకొను పసిపాపరాజు వడగవలె నుండెన

ఆయన తను వాగియాగి, దీర్ఘముగ నిగిడించు నిశ్వాసములచే చలించుచుండెను. చూచువార కాయన జాగృతుడుగ కన్పించుచున్నను, జ్ఞానేంద్రియ వ్యవహారమున కతీతమైన స్థితియం దుండెను. ఆయన మనసా రగిలిపోవుచుండెను. ఏదో అశాంతి, అసంతృప్తి తా నేమి చేసిన శాంతి లభించునో ! అయినను తనకు శాంతి లేకపోవుటకు హేతువేమి?

లౌకికముగ మానవుఁడు వాంఛించు సర్వసుఖములు తనకు సమృద్ధిగ నున్నవి. తన కనుసన్నఁబడి లక్షలాది సైన్య మవసరమగుచో ప్రాణము లర్పించును విశాలాంధ్ర, కర్ణాటక సామ్రాజ్యమునకు తాను ప్రభువు తండ్రిలేని తనను రాజకీయపు దుస్తంత్రముల నుండి తన యపరితమైన బుద్ధికౌశలముతో సామ్రాజ్యాధిపతిని జేసి, కన్నాకు వలె కాపాడుకొను అప్పాజీ తన కున్నాడు ప్రాణాధికప్రియలై, తనకు మనోనుకూలలై వర్తించు రాణు లున్నారు ! తిరుమల స్నిగ్ధగంభీర హృదయ చిన్నాదేవి నిత్యమంజుల మధుమానమూర్తి ! వా రిరువుర నృత్యసంగీతములు తన జీవితమును నిత్యవసంతముగఁ దీర్చిదిద్దుచున్నవి అరివీరభయంకరుఁడై తాను శాత్రవుల సుఱుమాడి విజయపరంపరలఁ జూరగొనినాడు ! భువనవిజయ సభాభవనమును నిర్మాణింపఁ జేసి, అష్టదిగ్గజములఁ బోషించి, ఆంధ్ర సారస్వతమున కనలేని సేవ యొనర్చినాడు. తన యాస్థానమున నాంధ్రశారద తన్మయత్వంతో పులకించి నర్తించినది ! వాగ్దేవి కటాక్షము తన కున్నంతగ నేరికిని లేదు ! స్వయముగ తాను మహాకవుల గౌరవించి పోషించుచు, వారందఱ నధిగమించు శైలిలో మహాకావ్యమును రచించి, ప్రబంధకర్త యైనాడు. సంస్కృత వాఙ్మయమునకు భోజ మహారా జెట్టి సేవ యొనర్చెనో, తానట్లుగ నాంధ్ర వాఙ్మయమును సేవించి ఆంధ్ర భోజుఁడైనాడు. తాను కాని దేమియు లేదు, కాని అయిన దేమియు లేదనిపించుచున్నది ! నిరంతరమెదో వేదన తనయాత్మ నంటిపెట్టుకొని, మనస్సును వేధించుచున్నది. తన కర్తవ్యమును తాను విస్మరించెనా, లేక నేదైన దైవిక ప్రేరణయో కాని, యేదో రూపుకట్టని యవ్యక్త మహాశక్తి అనంతమై కన్నుల సాంధ్యము ద్రిమ్మరించు కోటి సూర్యప్రభాభాసమానమైన తేజస్సు త న్నాకర్షించుచున్నది. ఆ పిండీకృతమైన తేజస్సులో తనకు రూపేర్పరింప వీలుకలుగుటలేదు. కన్ను మూసినఁ జాలును. ఆ వెలుగు దర్శన మొసఁగును. తాను తట్టుకొనలేకున్నాడు. ఆ వెలుగునకు మూలస్థాన మెచ్చట నున్నదో ! ఉన్నచో నది తన కెట్లు తెలియును? అది తెలిసిన గాని దానిని దర్శించిన గాని తనకు నిద్దుర రాదు. శాంతి లేదు. అంతదనుక తా నేమియు కాదు. తాను దర్శించుచున్న తేజస్స్వరూపము గూర్చి

తేజఃపుంజము నిలువరించుచున్నది. ఇంతదనుక మే మా తేజస్సులో మూర్తిని వెదకికొనుచున్నాము. ఎంతయోజించినను, ధ్యానించినను, అట్టిది రూపుకట్టలేదు. ఎన్నో రాత్రులు మా కా ధ్యానములో నిద్రాదూరములైనవి. ఆ తేజస్సు పరమాద్భుతము ! నడి వేసఁగినాటి మిట్టమధ్యాహ్న సమయమునందు, తుంగభద్రానదీ తరంగములపై సూర్యకిరణ ప్రసారముచేనైన, తళతళలు దానిముందు మిణుగురుల కాంతికూడ గాదు ! దానిని చర్మచక్షువులు దర్శించలేవువలె నున్నది. కన్నులు మూసికొనినను. ఆ తేజోభావము వదలిపెట్టదు. మనసా, మేము వితర్కించి వితర్కించి ప్రయోజనము లేమి నిస్పృహఁ జెందినాము.

తాతాచార్యులు: ఏమి, తేజఃపుంజమా ! ప్రభువులు మూర్తి నన్వేషించుచున్నారా?

"అవును. మా కది సాధ్యము కాలేదు. చిత్రముగ గడచినరేయి మాకు స్వప్నమునం దీ మూర్తి దర్శన మొసఁగినది ! మొదట విరాణ్మూర్తియై, తదుపరి క్రమముగ మేము తెల్పిన నారాయణ స్వరూపము రూపుకట్టినది. అచ్చట మా దేవేరులు కూడ కన్పించిరి."

పెద్దన: ప్రభూ ! తమ రాత్మచే నద్వైతస్థితికి దగ్గఱవారైనను, ప్రధానముగ తాము వైష్ణవులు. విష్ణ్వంశ తమ యందు సమృద్ధిగ నున్నది. 'నా విష్ణుః పృథివీపతిః' తాము పృథ్వీవల్లభులు ! జగన్నాథుఁడైన శ్రీమహావిష్ణువు తమ కారాధ్యదైవము. కావుననే తమ కా తేజోమండలము నారాయణ స్వరూపమై దర్శనమొసఁగినది. నామరూప లింగవిరహితమైనది మహస్సు ! అది యద్వైతుల కుపాదేయమైనది. ఆ మహస్సుయొక్క తొలివికారము లీ దేవతామూర్తులు ! బీజాక్షర సంపుటిచే దేవతాస్వరూపసిద్ధి కలుగుచున్నది ప్రభూ ! తాము దేవతాత్ములు ! కావుననే తమకు దేవతాదర్శన మయినది. గోపికలు, రాధ, రుక్మిణి వీరందఱు శ్రీకృష్ణదేవుని దేవతామూర్తిగ ధ్యానించి, సాయుజ్యముఁజెందినారు.

ప్రభువు: మీ వివరణము బాగున్నది. ఇంతకు, మాకు స్వప్నమందు సాక్షాత్కరించిన స్వామి యెవరు? అట్టి క్షేత్ర మెచ్చటనైన నున్నదా ! ఆ స్వామిని దర్శించినగాని, మాకు మనశ్శాంతి లభించదు.

తాత: ప్రభూ ! తాము వివరించిన వివరణమును బట్టి యా మూర్తి శ్రీ శ్రీనివాసదేవుని దనిపించుచున్నది !

ప్రభువు చకితుఁడై "ఏమి ! అట్టి మూర్తియైన స్వామి యున్నాడా? ఎచ్చట నున్నారు? తమకుఁ దెలియునా? తా మెవ్వరైన దర్శించితిరా? సత్వరముగఁ దెల్పిన సంతసింతు"మనెను.

పెద్దన: ప్రభూ ! ఆ శ్రీనివాసుని క్షేత్రము, తాము వర్ణించిన ప్రకారమైనచో తిరుమలయై యుండును,

"పెద్దనార్యా ! తా మెన్నఁడైన నా క్షేత్రమును దర్శించినారా?"

"ఒకే యొకమారు. నే నింకను తమ యాస్థానమున నెలకొని యుండనినాడు. చిన్నతనమున మా తండ్రిగారితో కలసి దర్శించితిని. ప్రభూ ! ఆ స్వామి ఆపదమ్రొక్కులవాఁడు. ఆయనను స్మరించి ముడుపులు చెల్లించుచో, సర్వవాంఛలును సానుకూలము లగును. సర్వవ్యాధులు నివారణమగును."

తాత: ప్రభూ ! ఆ స్వామి ఆశ్రిత సులభుఁడు. ఆయన పావదహనమూర్తి. ఆయన సాక్షాత్తు వైకుంఠము నందలి వరవాసుదేవమూర్తి యందురు.

"అయినచో మా భాగ్యము పండి స్వామి మమ్మనుగ్రహించినాడు. మనము శీఘ్రమే తిరుమలకు పోయి, ఆ స్వామిని దర్శించవలె."

తాత: అవశ్యము. నాకుసైత మా స్వామిని దర్శించు నిచ్ఛ చాలకాలము నుండి బలీయముగనున్నది.

పెద్దన: నాకును నట్లేయున్నది.

ప్రభువు: సాధ్యమయినంత త్వరితముగ మన మచ్చటికేగి ఆ స్వామిని సేవించవలె. మా మనస్సునంత యాకట్టుకొనిన యా స్వామి మా కులస్వామి యగుగాక ! ఆ స్వామిని, మేము మా దేవేరులతో సహా దర్శించెదము. మన వెంట మన పురోహితులైన రంగదీక్షితులు, శివదీక్షితులు, నిత్యసేవకుఁడైన చాగూరి మల్లఁడు, అంతరంగిక శాసనలేఖకుఁడును, వ్యవహర్తయునైన శ్రీపతియు రావలె !

పెద్దన: చిత్తము ప్రభూ !

సాయం సమయ విధి నిర్వహణకై ప్రభువభ్యంతర మందిరమున కరిగెను. తాతాచార్యులవారు, పెద్దనార్యు లొకరి యొద్ద నొకరు సెలవుఁగైకొని వెడలిపోయిరి. ఆకసమున హరివిల్లు మలయకూట ప్రాసాదమునుండి సప్తవర్ణముల తళ్కులీనుచు, సప్తగిరీశుని కృపాపాంగకాంతులు వర్షింపన్, విద్యానగరమే వింతయందమును నంతరించుకొన్నట్లయినది !

## 3

పెంపుడు చిలుకలకు పల్కులు నేర్పుచున్న మహారాజ్ఞి తిరుమలదేవి, నాగిని పరువెత్తివచ్చుట చూచి, "ఎందుకంత తొందర? ఆ వేగమేమి?" అని ప్రశ్నించెను.

"మహారాజ్ఞీ ! ప్రభువులు వేంచేయుచున్నారు !"

"ప్రభువులా? ఈ సమయముననా? ఆశ్చర్యముగ నున్నది ! భువనవిజయ సభాభవనమున, రాజకీయములను చర్చించవలసిన యవసరమున, మా మందిరముల కేల దయచేయుచున్నారో ! నాగినీ ! చిన్నాదేవిగారిని మేము శీఘ్రముగ రమ్మంటిమని చెప్పి రమ్ము."

"చిత్తము."

వచ్చిన నాగిని వచ్చినంత వేగముగ వెడలిపోయినది.

తిరుమలదేవికి ప్రభువుల రాకలోని యాంతర్యమవగతమగుటలేదు. చిన్నకూడ నుండిన బాగుండును ! ప్రభువు లెచ్చటికైన యుద్ధయాత్ర తలపెట్టినారేమో ! ఎందువలననో కొలది నెలలుగ ప్రభువులు నిరంతరాలోచనామగ్నులుగ కనిపించుచున్నారు. ఎల్లవేళల తమలోలో నేదో వెదకుకొనుచున్నటుల ఏదో యలభ్యమగుదానిని లభ్యమొనర్చుకొనుటకు, జీవుఁడు పడు బాధవంటి దాని ననుభవించుచున్నటుల కన్పించుచున్నారు.

ప్రొద్దుట శారదామందిరమున చిన్నకూడ నిట్లే యనినది. ప్రభువులను కూడ కలవరపఱచు విషయము లేముండును ! ప్రతి జీవికిని జీవనిత్యములైన కొన్ని సమస్యలుండును. అవి ఈ జన్మ సంబంధములు కూడ కాకపోవచ్చును. వానికై జీవి బాధఁజెందుచునే యుండును. ఏమయినను, ప్రభువులు మనసా స్వస్థులైనఁగాని, రాజ్యమునకు రక్షలేదు ! అప్పాజీవారి కిపయేవియుఁ దెలియవా? వారు సహస్రాక్షులు. వారికిఁ దెలియనివనియుండునా? రాజకీయ సంబంధమైన చింతన మాత్రము కాదు.

గజపతు లుద్ధతులై, విద్యానగరముపై కయ్యమునకు కాలుదువ్వుచున్నారని చారుల నుండి వార్తలు వచ్చుచున్నవి. గజపతు లెంతటి సమర్థులయినను, అప్పాజీ ధీశక్తికి, ప్రభువుల దోర్బలమునకు జోహారులర్పించి, తల వొగ్గవలసినదే ! అగ్నికల్పులైన అప్పాజీ, వాయు సదృశులైన ప్రభువుల కలయికయై, దక్షిణాపథమంతయు నిశ్శత్రుకమై, ఏకచ్ఛత్రాధిపత్యముగ వెలుఁగుచున్నది. విరూపాక్ష మహాదేవుని తల నెలవంక, చల్లని వెన్నెలలు తమ రాజ్యమునకు, ప్రభువులకు రక్షగ నున్నంతకాలము సర్వతోభద్రమే !

తిరుమలదేవి కరములు మోడ్చి, విరూపాక్షస్వామికి నమస్కరించినది.

ప్రభువులు చిన్నాదేవి ద్వితీయులై, మందిరమున నడుగుమోపిరి. తిరుమలదేవి సంభ్రమముతో ప్రభువు పాదముల బంగరు పళ్ళెరమున నుంచి, ప్రక్షాళనమొనరించి, తన చేలాంచలమున నొత్తి, ఆ పాద్యమును, తన శీర్షముపై చల్లుకొని, చిన్నాదేవి శిరముపైఁగూడ చల్లెను. ఆమె భక్తి వినమ్రురాలై, తిరుమలదేవికి పాద నమస్కార మొనర్చినది. తిరుమల యామెను లేవనెత్తి కౌగలించెను. ప్రభు వా దృశ్యమును తిలకించి పులకించిపోయెను. తన దేవేరులు-శ్రీదేవి, భూదేవివలె నున్నారనుకొనెను.

దంతపు సింహాసనమున సుఖాసీనుఁడైన ప్రభువు వామభాగమున సాంజలియై నిలబడి తిరుమల "ప్రభువు లాజ్ఞాపించుచో నేమైనఁజేయుటకు సిద్ధముగ నున్నా"మనెను.

ప్రభువు: అటులైన ప్రయాణమునకు సిద్ధముకండు.

తిరుమలదేవి యాశ్చర్యముతో "ప్రయాణమా ! ఏ దేశమునకు? ఎదిరిపక్షము, బలసంపన్నమైనదా? గజపతులపైననా? కళింగులపైననా?" అనెను.

ప్రభువు నవ్వుచు "దేవీ ! ఆగుమాగుము. మీ కెప్పుడు యుద్ధయాత్రలే ! మీ భర్త చతురంభోధి పరీత భూతధాత్రీపతి కావలెనని మీ యాంకాక్ష !" అనెను.



చిన్నాదేవి-అక్కగారి యభిలాష సహజమైనదే ! ఏ స్త్రీ తన భర్త జగన్నియంతయగుచో నంతసించదు !

ప్రభువు: 'అగుచో మీకుఁగూడ నట్టిదియే కోర్కెయన్నమాట ! మీ రా జగజ్జేతకు నియంత్రులగుటకు కాదు గద !

చిన్నాదేవి: అపచారము. మా కంతటి యహ మికలేదు.

చిన్నాదేవి మనస్సునందు తనకృతమై నందితిమ్మనగారిచే రచింతమైన పారిజాతాపహరణ గాథ మెఱసి, చెక్కుల నునుసిగ్గ తల వంచుకొనెను

తిరుమల: ప్రభువు లూరక పరాచికములాడుచున్నారు. మా కొలఁదులెఱుగక ప్రవర్తించువారము కాము ! ఇంతకు తాము ప్రయాణమును గూర్చి తెల్పితిరిగాదు !

ప్రభువు: దండయాత్రకు గాదు. దండముల యాత్రకు. జగన్నియంతృత్వమునకు గాదు. జగన్నియంతను దర్శించి తరించుటకు !

తిరుమల: జగన్నియంతను సందర్శించుటకా ! దండముల సామియా !

చిన్నాదేవి: అయినచో, అక్కగారి కోర్కె సమంజసమైనదే కద !

ప్రభువు: ఎందువలన?

తిరుమలదేవి సెలవివార మెచ్చుకోలుగ నవ్వుచు "చిన్నా ! చిన్నా ! నీవు మిక్కిలి చమత్కారిణివి ! చెల్లెలు తిమ్మనగారి శిష్యురాలు !" అనెను.

చిన్నాదేవి: అక్కగారు పెద్దనగారి శిష్యురాలు !

ప్రభువు: మీ అక్కసెల్లెం డ్రిరువురు మా కుపాధ్యాయినులు !

తిరుమల: అపచారము. స్వామి సేవకై యరుగువేళల...

"దేవీ ! మీ యౌచిత్యమర్యాద, ప్రశంసనీయము. మన మా శ్రీగిరిపై వేంచేసియున్న శ్రీనివాస ప్రభువును దర్శింప నేగుచున్నాము. చిరకాలముగ మమ్ము వేధించు సమస్య కీ నాడు పరిష్కారము కుదిరినది. మే మెన్నియోమారులు శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించి సేవించితిమి. అదేమి చిత్రమోగాని శ్రీగిరీశుని దర్శింతమను నూహయే పొడమలేదు. నేటికి స్వామి తానై స్వప్నమున సాక్షాత్కరించి, దివ్యదర్శనము ననుగ్రహించినాడు !"

తిరుమల: ధన్యురాలను. ఆ స్వామి మా వృట్టినింటివారి కిలువేల్పు !

చిన్నాదేవి: వారి కృపాప్రసాదమై ఈ తిరుమలదేవి జన్మించినది !

తిరుమల: మన చిన్నాదేవి కా స్వామి యారాధ్యదైవము !

"మీరు మాతో నెన్న డీ విషయము ప్రస్తావింపనైనలేదు ! పోనిండు. దేనికైన కాలము కూడిరావలె గద. స్వామి కుపాయనములు సంతరించుకొనుఁడు. మీ యభీష్టానుసారము సర్వము సిద్ధము గావింపఁబడును."

రాణులు "మహాప్రసాద" మనిరి.

"నాలుగు దినముల క్రిందట మే మొక స్వప్నమును గాంచితిమి. అందు స్వామి విరాణ్మూర్తియై, దర్శన మొసఁగి, యంతలో నారాయణమూర్తి, శ్రీనివాసమూర్తియై కన్పించెను. ఆ స్వామి సమక్షమునందు మీ ఇరువుర నృత్యగానముల నాస్వాదించి పొంగిపోయితిమి. మనము ముగ్వుర మాయన సన్నిధిలో నున్నాము. స్వప్నసాక్షాత్కర మొసఁగి, మనలఁ దనయొద్దకు రమ్మని యాదేశించినారు."

"మహాభాగ్యము ! మన జన్మములు సార్థకములైనవి"

చిన్నాదేవి నృత్యోపహారము, తిరుమలదేవి సంగీతారాధనములతో స్వామి పులకించిపోయి యుండును.

తిరుమల: ప్రభూ ! తమ యాత్మ దేవతానిష్ఠమైనది. తమ యాత్మయందు దేవతలు సర్వదా నివసింతురు !

చిన్నాదేవి: ప్రభువులు దేవతాత్మలు ! తమ కర్ధాంగుల మౌట మేము తరించుచున్నాము.

"మీ రిరువు రర్ధాంగులై మా యస్తిత్వమే లుప్తమయినది !"

తిరుమల: ప్రభువులు మనల నాట పట్టించుచున్నారు ! తమముందు మా యస్తిత్వమెంత? మే మెంతటివారము ప్రభూ ! మేము మిమ్మనుసరింతుము, సహచరింతుము. మీ నీడలు మాపైఁ బర్వ మేము పూతచరితల మగుదము.

"దేవీ ! ఎంత చదివితిరి ! మేమే మన్నామని ! మీలో నొకరమగుటకే మేము వాంఛింతుము. ముగ్వుర మొకఁడై త్రివేణీ సంగమమట్లు పవిత్ర జీవితముల గడపుదము.

చిన్నాదేవి: మన చిరంజీవి పట్టాభిషిక్తుఁడయిన పిమ్మట, మన కేమంత బాధ్యత లుండును !

"చిన్న దూరదర్శిత యభినందింపఁదగినది. ఏకమూర్తియైన ఈ స్వామికి మేము తిరుముడి నవరత్నములతో చేయించుటకు సంకల్పించితిమి. ఒక త్రిసరము నింద్రనీలములతో, గోమేధికములు, మాణిక్యములు, పొదిగిన దానిని స్వామికి సమర్పింపఁదలంచితిమి. ఇరువదియైదు వెండి పళ్ళెరములు, స్వామివారి కర్పూరహారతికై యొసఁగ నిర్ణయించుకొంటిమి. మా 'ఆముక్తమాల్యద' కావ్యమును శ్రీవారి కంకిత మిచ్చుచున్నాము. మీరు కూడ మీ మీ యభీష్టముల ననుసరించి స్వామి కుత్సవోపాయనములఁ సమర్పించుకొనుఁడు."

తిరుమల: ధన్యలము ! తప్పక యట్లే యొనర్తుము.

చిన్నాదేవి: అంతకంటే, నా కింతకాలమునకు స్వామిని దర్శించు భాగ్యమబ్బినది ! పరమానందముగ నున్నది !

"మీ రిరువురు మాకు శాంత్యానందకారిణులు. మీ చల్లని శుభకామనలే మన సామ్రాజ్యమునకు రక్షాకవచములు !"

మంత్రి తిమ్మరుసుల వారినుండి వార్తాపహుఁడు రాగా, ప్రభువు వెడలిపోయెను. రాణు లిర్వురు స్వామివారికి సమర్పించవలసిన యుపాయనములఁ గూర్చి యోజించుకొనుచుండిరి. మధ్యాహ్న పూజావసానమును దెల్పు ఘంటారావము లుభయ దేవాలయములనుండి యొకేమారుగ శ్రవణగోచరమైనవి. రాణు లిరువురు అప్పాజీవారి పిలుపులోని యాంతర్యము నూహ సేయుచుండిరి. అప్రయత్నముగ నిర్వురొకేమారుగ 'చిన్నా !' యని 'అక్కగారూ !' యని యొకరి నొకరు సంబోధించి, అంతలో కిలకిల నవ్వుకొనిరి !

తిరుమల: చిన్నా ! వ్యవహారము గజపతుల విషయమై యుండును. వారు శ్రమసాధ్యులు. వారి గజబలము దొడ్డది. వారు మిక్కిలి సాహసులు !

చిన్నాదేవి: అక్కగారూ ! అప్పాజీవారి యుద్ధతంత్రములు, ప్రభువుల సమర కౌశలము ముందెట్టి బలములును నిలువజాలవు.

తిరుమల: ఔను. ఏదియేమైనను ముందు శ్రీనివాసదేవుని దర్శించిగాని యెట్టి కార్యక్రమమున కుపక్రమింపరా దనిపించుచున్నది. ఆ స్వామికి నివేదించుకొనిన సర్వము సానుకూలమగును.

చిన్నాదేవి: ప్రభువుల సంకల్పములు సిద్ధములు ! వాని కసాధ్యమనునది లేదు. ఇదియు, నందలి భాగమే. ప్రభువులు గజపతులనే కాదు, కళింగులను కూడ నిర్జింతురు.

తిరుమలదేవి చిన్నారాణిని కౌఁగలించి-'ఎంత చల్లని మాట యంటివి చెల్లీ ! ఆ స్వామి యనుగ్రహముచే ప్రభువులు విజేతలై తిరిగి తిరిగి స్వామిని దర్శించి యర్చింతురు !

చిన్నాదేవి: మీ సంకల్పము జరిగినది. తప్పక యట్లే యగును.

తిరుమల: 'మీ' కాదు. 'మన' యనవలెనమ్మా !

చిన్నాదేవి: నే నదృష్టవంతురాలను అక్కగారూ !

సువారము నుండి భోజన సమయ ఘంటారావము వినవచ్చినది.

రాణు లిరువురు సంభ్రమమున లేచిరి.

[సశేషం]




